సంపుటి :02 సంచిక :129 పేజీలు :04
వెల ₹5
అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people
గురువారం 10, జూలై 2025




### మానవ అక్రమరవాణా పట్ల
## అప్రమత్తంగా ఉండాలి

04

ఏహెచ్ టీయూ వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఇన్ స్పెక్టర్ శ్యామ్ సుందర్



5లో..

### భద్రకాళి అమ్మవారికి
## శాకంబరీ శోభ

అక్షర దర్బార్, వరంగల్: వరంగల్‌లోని శ్రీ భద్రకాళి దేవస్థానంలో శాకంబరీ నవరాత్ర మహోత్సవాలు గురువారం ముగిశాయి. అమ్మ వారిని కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో శాకంబరీ అలంకరణలో అలంకరించారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జ్యోతి ప్రజ్వలన చేసి, భక్తులకు దర్శనానికి అనుమతినిచ్చారు. ప్రత్యేక క్యూలైన్లలో భక్తులు "భద్రకాళీ శరణం మమ" నినాదాలతో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ సిబ్బంది, పోలీసులు తగిన ఏర్పాట్లు చేశారు.




‘రేషన్ కార్డు కావాలి సార్. నాకు డబ్బులు ఇచ్చేంత వెసులుబాటు లేదు. దయచేసి కార్డు ఇప్పించండి సార్. నాకు భూమి లేదు. నేను వ్యవసాయ కూలిని. నాకు భార్య, ఇద్దరు పిల్లలు. ఒక్కసారి కార్డు వస్తే నెలనెలా బియ్యం వస్తాయి. కుటుంబానికి ఆరోగ్యశ్రీ వర్తిస్తుంది. భవిష్యత్తులో పిల్లల చదువులకు ఉపయోగ పడుతుంది’ అని మరిపెడ మండలం బుర్హాన్‌పురానికి చెందిన సైదులు ఇటీవల తహసీల్దారు కార్యాలయంలో యంత్రాంగం ముందు ప్రాధేయపడ్డాడు. కానీ, అధికారులు మాత్రం అతడిని రూ.రెండు వేల రూపాయలు లంచం అడిగారు. దీంతో బాధితుడు ఏమీ చేయలేక వెనుదిరిగాడు. మానుకోట జిల్లాలోని అన్ని తహసీల్దారు కార్యాలయాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొన్నది.

– అక్షరదర్బార్, మరిపెడ

- మీసేవ, తాహసీల్ కార్యాలయాల్లో దందా
- కార్డు కావాలన్న వారి నుంచి డబ్బు గుంజుడు
- మధ్యవర్తులుగా దళారులు.. పైసలిస్తే ఒకరోజులోనే పని పూర్తి
- మానుకోట జిల్లా మరిపెడ మండలంలో జోరుగా అక్రమాలు

2లో..

### రూ.2 వేలు కొట్టు
# రేషన్ కార్డు పట్టు

---

### ప్రభాకర్‌రావుకు
# షాక్

- ఫోన్ ట్యాపింగ్ కేసులో ట్విస్ట్
- సుప్రీం కోర్టును ఆశ్రయించనున్న ‘సిట్’



రాష్ట్రంలో కొద్దినెలలుగా చర్చనీయాంశంగా ఉన్న ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకున్నది. మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు విచారణకు సహకరించకపోవడంతో సిట్ అధికారులు సుప్రీంకోర్టులో పిటిషన్ వేయనున్నట్టు సమాచారం.

-అక్షరదర్బార్, హైదరాబాద్

04

### పర్యవేక్షణ
## బాధ్యత జవాన్లదే

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- 4, 5, 6 డివిజన్లలో క్షేత్ర స్థాయి శానిటేషన్ తనిఖీలు

02



## 18 మంత్రి మండలి సమావేశాలపై చర్చ

- రేషన్‌కార్డుల జారీ, బీసీ రిజర్వేషన్లపై కూడా
- అనేక అంశాలపై గంటల పాటు చర్చించిన సీఎం
- సుదీర్ఘంగా సాగిన క్యాబినెట్ మీటింగ్

02



# పర్యవేక్షణ బాధ్యత జవాన్లదే

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- 4, 5, 6 డివిజన్లలో క్షేత్ర స్థాయి శానిటేషన్ తనిఖీలు

అక్షరదర్బార్, హనుమకొండ: క్షేత్ర స్థాయిలో పారిశుద్ధ్య సిబ్బంది పనితీరు, పర్యవేక్షణ బాధ్యత జవాన్లదే అని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. నగరంలోని 4, 5, 6 డివిజన్ల పరిధిలోని టైలర్ స్ట్రీట్, కుమార్ పల్లి మార్కెట్, రెడ్డిపురం, పెగడపల్లి డబ్బాలు ప్రాంతాల్లో గురువారం కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి సానిటేషన్ నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్ ను పరిశీలించిన కమిషనర్ హాజరులో నమోదు చేసిన సిబ్బంది ఏరియాలో ఎక్కడ పని చేస్తున్నారో తనిఖీ చేశారు. ఏరియాలో ఎంత మంది జవాన్లు విధులు నిర్వహిస్తున్నారు? జవాన్లకు, సిబ్బందికి సమన్వయం ఉందా? లేదా? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. జవాన్లు సిబ్బంది విధులను నిరంతరం పర్యవేక్షించాలని, స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లు ప్రతి రోజు ఎన్ని ట్రిప్పులు వేస్తున్నారో పరిశీలించాలని, ఆయా ప్రాంతాల్లో డ్రైన్ లను ఎన్ని సార్లు శుభ్రం చేస్తున్నారో అవగాహన ఉండాలని, సిబ్బంది విధి నిర్వహణ విషయంలో తప్పుడు సమాచారం అందిస్తే సంబంధిత జవాన్లను సస్పెండ్ చేయడం జరుగుతుందని, శానిటేషన్ తదుపరి ట్రేడ్ కలెక్షన్ వసూలు చేసే బాధ్యత జవాన్లదేనని అన్నారు. జవాన్లకు కేటాయించిన డివిజన్లలో 100 శాతం గృహాల నుండి చెత్త సేకరణ తడి పొడి చెత్తను వేరు చేసి సేకరించాలని, స్వచ్ఛ ఆటోలకు తడి పొడి చెత్తను వేయడానికి వీలుగా వేరు వేరు కంపార్ట్ మెంట్ లు ఉండాలని, జవాన్లకు కేటాయించిన ఏరియాలో ట్రేడ్ లైసెన్స్ లేకుండా దుకాణాలు నడిపితే సంబంధిత జవాన్ పెనాల్టీ చెల్లించాలని కమిషనర్ పేర్కొన్నారు.






రూ.2 వేలు కొట్టు

# రేషన్ కార్డు పట్టు

- మీసేవ, తాహసీల్ కార్యాలయాల్లో దందా
- కార్డు కావాలన్న వారి నుంచి డబ్బు గుంజుడు
- మధ్యవర్తులుగా దళారులు.. పైసలిస్తే ఒకరోజులోనే పని పూర్తి
- మానుకోట జిల్లా మరిపెడ మండలంలో జోరుగా అక్రమాలు




అక్షరదర్బార్, మరిపెడ : 'రేషన్ కార్డు కావాలి సార్. నాకు డబ్బులు ఇచ్చేంత వెసులుబాటు లేదు. దయచేసి కార్డు ఇప్పించండి సార్. నాకు భూమి లేదు. నేను వ్యవసాయ కూలిని. నాకు భార్య, ఇద్దరు పిల్లలు. ఒక్కసారి కార్డు వస్తే నెలనెలా బియ్యం వస్తాయి. కుటుంబానికి ఆరోగ్యశ్రీ వర్తిస్తుంది. భవిష్యత్తులో పిల్లల చదువులకు ఉపయోగపడుతుంది' అని మరిపెడ మండలం బుర్హాన్‌పురానికి చెందిన సైదులు ఇటీవల తహసీల్దారు కార్యాలయంలో యంత్రాంగం ముందు ప్రాధేయపడ్డాడు. కానీ, అధికారులు మాత్రం అతడిని రూ.రెండు వేల రూపాయలు లంచం అడిగారు. దీంతో బాధితుడు ఏమీ చేయలేక వెనుదిరిగాడు. మానుకోట జిల్లాలోని అన్ని తహసీల్దారు కార్యాలయాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొన్నది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డుల జారీ ప్రక్రియలో మీసేవ కేంద్రాల నిర్వాహకులు, రేషన్ డీలర్లు, తహసీల్దార్ కార్యాలయంలోని కొంతమంది అధికారులు కలిసి చేతివాటం చూపుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో అరులైన పేదలకు రేషన్ కార్డులు అందించాలన్నది ప్రభుత్వ ధ్యేయం. రేషన్ కార్డు ఉంటేనే ఆరోగ్యశ్రీ, సన్న బియ్యం వంటి పథకాలు కుటుంబాలకు లభిస్తాయి. కార్డు కావాలని కోరుకుంటున్న పేదల ఆశలను అదనుగా తీసుకుని కొందరు అధికారులు ప్రత్యేకంగా దళారులను నియమించుకుని వసూళ్లకు పాల్పడుతున్నారు. సామాన్యుడు కొత్తగా రేషన్ కార్డు పొందాలన్నా, పాత కార్డులో నుంచి పేర్లు తొలగించుకోవాలన్నా, పిల్లల పేర్లు చేర్చుకోవాలన్నా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఈ దశలన్నింటిని బాగానే తెలిసిన సేవ కేంద్రాల నిర్వాహకులు, తహసిల్దార్ ఆఫీసు పరిధిలోని వ్యక్తులు దళారులతో కుమ్మక్కు ఒక్కో కార్డుకు రెండు నుంచి మూడు వేల రూపాయలు వసూలు చేస్తున్నారు.

**- డబ్బు ఇస్తేనే పెండింగ్ తొలగింపు**

**మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు తీసుకొని తహసీల్దార్ కార్యాలయానికి వరకు రప్పిస్తారు. కానీ డబ్బు ఇచ్చేవరకు ఫైళ్లు డీఎస్ వో వద్ద పెండింగ్ లో పడేసి ఉంచుతున్నారనే విమర్శలు ఉన్నాయి. డబ్బులు చెల్లిస్తేనే కార్డు మంజూరుచేసి, పెండింగ్ జాబితాలో నుంచి పేరు తొలగిస్తారని బాధితులు చెబుతున్నారు. "ఇప్పుడు కార్డు రాకపోతే మరో ఐదేళ్లకు రాదు" అని భయపెట్టడంతో పాటు "సెప్టెంబర్ నుంచే సన్న బియ్యం వస్తుంది, తప్పకుండా ఇప్పుడే చేసి పెట్టుకో" అని చెప్తున్నారు. రేషన్ వ్యవహారాలు, దరఖాస్తు ప్రక్రియ గురించి గ్రామీణులకు పూర్తిగా అవగాహన ఉండకపోవడం వల్లే ఈ దందాకు ఆస్కారం కలుగుతున్నది.**

**- దళారులకు వరం**

కొత్తగా కార్డులు పొందడం, పాత కార్డుల నుంచి పేర్లు తొలగించడం, పిల్లల పేర్లను చేర్చడం వంటి విషయాల్లో ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం వల్లే కొందరు సానుకూలంగా డబ్బులు కడుతున్నారు. అధికారులు కఠిన చర్యలు తీసుకుని దళారుల దందా పనిపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# 18 మంత్రి మండలి సమావేశాలపై చర్చ

- రేషన్ కార్డుల జారీ, బీసీ రిజర్వేషన్లపై కూడా
- అనేక అంశాలపై గంటల పాటు చర్చించిన సీఎం
- సుదీర్ఘంగా సాగిన క్యాబినెట్ మీటింగ్

అక్షరదర్బార్, హైదరాబాద్: హైదరాబాద్‌లోని సచివాలయంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సుదీర్ఘంగా క్యాబినెట్ సమావేశం జరిగింది. భేటీలో సీఎం పలు కీలక అంశాలపై చర్చించారు. గత సమావేశంలో మూడు నెలలకోసారి క్యాబినెట్ సమావేశాన్ని 'స్టేటస్ రిపోర్ట్ మీటింగ్'గా నిర్వహించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు జరిగిన 18 మంత్రి మండలి సమావేశాల్లో తీసుకున్న 327 నిర్ణయాలు, వాటి అమలుపై 'యాక్షన్ టేకెన్ రిపోర్ట్'పై ప్రధానంగా చర్చించారు. కాళేశ్వరం పరిధిలోని మేడిగడ్డ బరాజ్ మరమ్మతులపై ఎన్‌డీఎస్ఏ, విజిలెన్స్ ఇచ్చిన నివేదికలపై చర్చించినట్లు తెలిసింది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ సవరణ చట్టం, రేషన్ కార్డుల జారీ, బీసీ రిజర్వేషన్ల అమలు, స్థానిక సంస్థల ఎన్నికలు, గోశాలల నిర్మాణం, మహిళల కోసం మరిన్ని కార్యక్రమాలు.. తదితర అంశాలపైనా మంత్రిమండలిలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం.

# ఆసుపత్రిలో చేరిన కేసీఆర్

**- మరోసారి వైద్య పరీక్షలు**

అక్షరదర్బార్, హైదరాబాద్: మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గురువారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో చేరారు. వైద్యుల సూచన మేరకు ఆయన అడ్మిట్ అయినట్లు తెలిసింది. కేసీఆర్‌కు మరోసారి వైద్యులు వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఈ నెల 3న కూడా ఆయన ఆసుపత్రిలో చేరారు. అప్పుడు బ్లడ్ షుగర్, సోడియం స్థాయిలను పరీక్షించి వైద్యం చేశారు. ఆయన్ను రెండు రోజులు ఆసుపత్రిలోనే ఉండాలని వైద్యులు సూచించారు. కేసీఆర్ అక్కడే ఉండి చికిత్స పొంది 5న డిశ్చార్జి అయ్యారు. వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని, తర్వాత తర్వాత పరీక్షలు చేయాల్సి ఉంటుందని డిశ్చార్జి సమయంలో వైద్యులు తెలిపారు. ఈక్రమంలో వైద్య పరీక్షల కోసం కేసీఆర్ మళ్లీ ఆసుపత్రికి వచ్చారు.

# బ్రెస్ట్ క్యాన్సర్ సర్జరీ విజయవంతం

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో డాక్టర్ సూపరిండెంట్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో బ్రెస్ట్ క్యాన్సర్ సర్జన్ ని గురువారం విజయ వంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్ కుమార్ విలేకర్లతో మాట్లాడుతూ చిట్యాల మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు తల్లి బుర్ర ఈశ్వరమ్మ బ్రెస్ట్ క్యాన్సర్ తో ఇబ్బంది పడగా గురువారం అనస్తిషియా హెచ్ఓడీ డాక్టర్ నవీన్ కుమార్ బృందం జనరల్ సర్జన్ల బృందం డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ కీర్తి స్వరూప్, డాక్టర్ విన్నెల, డాక్టర్ శ్రీవాణి, లు బ్రెస్ట్ క్యాన్సర్ సర్జరీ విజయవంతంగా చేయడం జరిగిందని తెలిపారు.



# మరింత వేగవంతం చేయాలి

**- కాజీపేట ఆర్ఓబీ నిర్మాణ పనులపై జిల్లా కలెక్టర్**

అక్షరదర్బార్, కాజీపేట: కాజీపేట ఆర్ఓబీ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. గురువారం కాజీపేట ఫాతిమా నగర్ సమీపంలో కొనసాగుతున్న ఆర్ఓబీ నిర్మాణ పనుల పురోగతిని అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన ఆర్ఓబీ నిర్మాణ పనులను, ఇంకా పూర్తి చేయాల్సిన పనుల గురించి ఆర్ అండ్ బీ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్ బాబును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. 72 మీటర్ల బోస్ట్రింగ్ గడ్డర్స్ ఒకవైపు పూర్తయిందని, మరొకవైపు పనులు పురోగతిలో ఉన్నాయని ఈఈ సురేష్ బాబు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఆర్ఓబీ పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. ఆర్ఓబీ నిర్మాణ పనులు పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, కాజీపేట తహసీల్దార్ భావు సింగ్, ఇతర అధికారులు ఉన్నారు.



# భద్రకాళిని దర్శించుకున్న మంత్రి

అక్షరదర్బార్, హనుమకొండ: భద్రకాళీ శాకాంబరీ నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని గురువారం రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వరంగల్ భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో మంత్రి కొండా సురేఖకి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి కొండా సురేఖ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని పూజించిన మంత్రి కొండా సురేఖ రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో మరింత ముందుకు పోవాలని మంత్రి కొండా సురేఖ ప్రార్థించారు.



# విద్యుత్ ప్రమాద బాధితుడికి విరాళాల వెల్లువ

- పలువురిని కదిలించిన 'అక్షర దర్బార్' కథనం
- పత్రికకు రుణపడి ఉంటాం: బాధిత కుటుంబం

అక్షర దర్బార్, మొగుళ్ళపల్లి: “జేబులో జీతాలు వేసుకునేదోకడు, శరీరం కాలిపోయేలా పనిచేసేదోకడు... అపద వస్తే ఆదుకునేదెవడు?” ఈ బాధతో కూడిన పదాలు, 'అక్షర దర్బార్' ప్రచురించిన చిన్న కవితా కథనం అనేక హృదయాలను కదిలించింది. మొగుళ్ళపల్లి మండలం మొట్లపల్లి గ్రామానికి చెందిన అనిల్ అలియాస్ అంజి విద్యుత్ సబ్ స్టేషన్‌లో అన్‌మ్యాన్డ్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తుండగా, ఈ నెల 3న విద్యుత్ ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి నుండి హైదరాబాద్ యశోద హాస్పిటల్‌కు తరలించగా, వైద్యం కోసం పెద్ద ఎత్తున ఖర్చవుతోంది. అంజికి సేవలందిస్తున్న విద్యుత్ సంస్థ నుంచి ఎటువంటి ఆర్థిక సహాయం లభించకపోవడంతో, అతడి కుటుంబం అప్పులపై ఆధారపడాల్సి వచ్చింది. వైద్యులు మరో రూ.10 లక్షల వరకు అవసరం అని తెలియజేయడంతో, అంజి దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నాడు. ఈ నేపథ్యంలో 'అక్షర దర్బార్' దినపత్రిక జూలై 3న ప్రచురించిన కథనం విస్తృతంగా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. ఈ కథనానికి స్పందించిన దాతలు అంజికి విరాళాలు అందిస్తున్నారు. గ్రామస్థాయి నుండి జిల్లాస్థాయి దాకా పలువురు దాతలు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. “మా బాధను ప్రపంచానికి తెలియజేసిన 'అక్షర దర్బార్' దినపత్రికకు రుణపడి ఉంటామని కుటుంబ సభ్యులు  ఈ సందర్భంగా పేర్కొన్నారు.








# యూరియా కొరత!

- ఇబ్బందుల్లో రైతులు
- గంటల తరబడి క్యూ లైన్ లలో అన్నదాతలు
- తెల్లారకముందే యూరియా కోసం క్యూ
- పలుకుబడి ఉన్నోళ్లకే యూరియా?
- అధికారులపై మండిపడుతున్న ప్రజలు

అక్షర దర్బార్, మొగుళ్ళపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో యూరియా కొరత తారాస్థాయికి చేరింది. మొగుళ్ళపల్లి మండల కేంద్రంతో పాటు మొట్లపల్లి ప్రాంతాల్లో యూరియా కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. తెల్లారకముందే రైతులు యూరియా దుకాణాల ముందు క్యూ లైన్‌లలో నిలబడుతున్నా, అవసరమైన యూరియా లభించక నిరాశకు గురవుతున్నారు.

## బస్తాలు తక్కువ... రైతులపై భారం

గురువారం మొట్లపల్లి రైతు సేవా కేంద్రానికి వచ్చిన యూరియా బస్తాలు 470 మాత్రమే కావడంతో చాలా మందికి అందలేదు. అయితే, సొసైటీకి సమాచారం అందగానే పెద్ద సంఖ్యలో రైతులు అక్కడికి చేరుకున్నారు. వారిలో చాలామంది ఖాళీ చేతులతో వెనుదిరిగారు. వచ్చేవే తక్కువ బస్తాలు అయినప్పుడు ఇలా అడ్డదారుల్లో అయిన వారికి పంచేస్తే తమ పరిస్థితి ఏంటని నిలదీస్తున్నారు.

## బ్లాక్ మార్కెట్ దందా

రైతుల వివరాల ప్రకారం, యూరియా కొరతను బ్లాక్ మార్కెట్ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పలుకుబడి ఉన్న వారికి మాత్రమే యూరియా దొరుకుతోందని, అధికార పార్టీకి చెందిన వారికే అధికంగా బస్తాలు అందుతున్నాయని, మిగిలినవారికి అందడం లేదని రైతులు వాపోతున్నారు. యూరియా కోసం తెల్లవారుజామునే వచ్చి గంటల తరబడి లైన్ లో నిలబడినా యూరియా దొరకక వెనుదిరుగుతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. సరైన ప్రణాళిక లేకపోవడంతో యూరియా కోసం ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలానికి సరిపడా యూరియాను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు

# 13న రాష్ట్ర సదస్సు

## - ఓంకార్ భవన్ లో పోస్టర్ ఆవిష్కరించిన నాయకులు

అక్షరదర్బార్, వరంగల్: తెలంగాణ రాష్ట్ర  ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో యుద్ధం ఎవరి కోసం అనే అంశంపై ఈనెల 13న జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గ్రేటర్ కార్యదర్శి రాచర్ల బాలరాజు, సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు మోడేం మల్లేశం, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు నున్న అప్పారావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి, ఇనాం సంస్థ జాతీయ కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ అలీ జుబేర్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య పిలుపునిచ్చారు. గురువారం ఓంకార్ భవన్ లో ఆయా పార్టీల బాధ్యులు సమావేశమై రాష్ట్ర సదస్సు పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సదస్సు నగరంలోని ఎల్బీనగర్ లో ఉన్న అబ్నుస్ ఫంక్షన్ హాల్  లో మధ్యా హ్నం 12 గంటలకు జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సుకు కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ వినాయక రెడ్డి అధ్యక్షత వహిస్తారని, వక్తలుగా  టిఎస్డిఎఫ్ రాష్ట్ర కన్వీనర్ జస్టిస్ చంద్రకుమార్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి శ్రీనివాస రావు, ఇనాం సంస్థ జాతీయ అధ్యక్షుడు కృష్ణ ప్రసాద్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి జే చలపతిరావు, ఎంసిపిఐయు రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సిపిఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు గుర్రం విజయ్ కుమార్, ఆర్ఎస్పి రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆరెల్లి కృష్ణ, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా, భారత్ బచావో రాష్ట్ర నాయకులు వెంగల్ రెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, టిఎస్ డీఎఫ్ రాష్ట్ర నాయకులు నైనాల గోవర్ధన్ ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐ(యు) రాష్ట్ర నాయకులు గోనె కుమారస్వామి, సిపిఐ ఎంఎల్ నాయకులు భైరబోయిన ఐలయ్య, హరిబాబు, ఖాజా అస్లాం, గంటా శంకర్, సుమన్, వీరన్న, రాజేందర్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# బొజ్యానాయక్ తండాను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- పునఃప్రారంభమైన ప్రభుత్వ పాఠశాల



అక్షర దర్బార్, నర్సంపేట: నర్సంపేట మండలంలోని బొజ్యానాయక్ తండాను ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. గురువారం ఆమె బొజ్యానాయక్ తండాను సందర్శించి, గతంలో మూసివేసిన ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాలను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా తండా యువకులు స్వచ్ఛందంగా తరగతులు నిర్వహిస్తూ విద్యాసేవలో పాలుపంచుకుంటున్న తీరును కలెక్టర్ ప్రశంసించారు. పాఠశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించిన నేపథ్యంలో, కలెక్టర్ శారద అధికారులు వెంటబెట్టుకొని పాఠశాల స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉండాలని ప్రభుత్వం గట్టి సంకల్పంతో ముందడుగు వేసింది. నూతన గదుల నిర్మాణం కోసం తగిన చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఎంఈఓ సారయ్య, తహసీల్దార్ రవిచంద్ర రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఇతర అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నానో యూరియానే సరైన ప్రత్యామ్నాయం

## –మండల వ్యవసాయ అధికారి పి.సురేందర్ రెడ్డి



అక్షర దర్బార్, మొగుళ్ళపల్లి: రైతుల పంటల దిగుబడి పెంపుతో పాటు వ్యవసాయ ఖర్చులను తగ్గించడంలో నానో యూరియా కీలక పాత్ర పోషిస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారి పి. సురేందర్ రెడ్డి తెలిపారు. గురువారం మొగుళ్ళపల్లి మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నానో యూరియా ద్రవరూపంలో ఉండి మొక్కలకు తక్కువ మొత్తంలో అవసరమైన నైట్రోజన్‌ను సమర్థవంతంగా అందిస్తుందన్నారు. ఇది సాంప్రదాయ గ్రాన్యూలర్ యూరియాకు సరైన ప్రత్యామ్నాయంగా వ్యవసాయ రంగంలో గుర్తింపు పొందుతోందని పేర్కొన్నారు. ఫోలియర్ స్ప్రే రూపంలో వాడితే పంటలకు వేగంగా శక్తి అందుతుందని, నేలలో నైట్రోజన్ మోటింపు తగ్గి మట్టి నాణ్యతకు ఎటువంటి హానీ కలగదని వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించేందుకు నానో యూరియా అద్భుత పరిష్కారమని అన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి ఈ ఎరువును వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.

# బీజేపీ స్టేట్ చీఫ్ ను కలిసిన చిట్యాల నేతలు

అక్షర దర్బార్, చిట్యాల : భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన నరపరాజు రామచందర్ రావును బుధవారం చిట్యాల మండల బిజెపి అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ నేతృత్వంలోని బిజెపి నాయకులు మర్యాదపూర్వకంగా హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామచందర్ రావు మాట్లాడుతూ, బిజెపిని గ్రామస్థాయిలో బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా శ్రమించాలన్నారు.



# విధులకు హాజరుకాని పరకాల ఎంఈఓ

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా
- రెగ్యులర్ ఎంఈఓను నియమించాలని డిమాండ్

అక్షర దర్బార్, పరకాల:పరకాల మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) రమాదేవి విధులకు హాజరుకాకుండా ప్రైవేట్ విద్యా సంస్థలకు ప్రోత్సాహం కలిగిస్తున్నారని ఆరోపిస్తూ, ఎస్ఎఫ్ఐ హన్మకొండ జిల్లా కమిటీ గురువారం ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టింది.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ, గత ఎనిమిది సంవత్సరాలుగా ఇన్‌చార్జి ఎంఈఓగా కొనసాగుతున్న రమాదేవి, ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ నడుస్తున్న పాఠశాలలపై ఆమె నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. "ప్రజాస్వామ్యంలో ప్రజల పక్షాన ఉండాల్సిన అధికారులే, ప్రైవేట్ ప్రయోజనాలకు సేవచేస్తుంటే ఎలా న్యాయం జరుగుతుంది?" అని మంద శ్రీకాంత్ ప్రశ్నించారు. వెంటనే ఆమెను సస్పెండ్ చేసి, పరకాల మండలానికి రెగ్యులర్ ఎంఈఓను నియమించాలని డిమాండ్ చేశారు.ఈ ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బిరెడ్డి జశ్వంత్, జిల్లా కమిటీ సభ్యులు చెన్నూరి సాయికుమార్, సాయి తేజ, గణేష్, శశాంక్, సందీప్, అజయ్, ప్రదీప్, రాజ్ కుమార్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.






# మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి

**–ఏహెచ్ టీయూ ఇన్ స్పెక్టర్ జే. శ్యామ్ సుందర్**




అక్షరదర్బార్, హనుమకొండ: మానవ అక్రమ రవాణా అనేది హీనమైన నేరమని, దీనిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఇన్‌స్పెక్టర్ జే. శ్యామ్ సుందర్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో, కమిషనర్ ఆదేశాలతో హనుమకొండలోని కుమారపల్లి ప్రభుత్వ మార్కజి పాఠశాలలో గురువారం మానవ అక్రమ రవాణా, బాలల సంక్షేమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్ సుందర్ మాట్లాడుతూ, 10 నుండి 18 సంవత్సరాల వయస్సు అత్యంత సున్నితమైనదని, ఈ దశలో పిల్లలు సులభంగా ప్రలోభాలకు గురై మోసపోయే ప్రమాదం ఉంటుందని చెప్పారు. పిల్లలు తమ సమస్యలు తల్లిదండ్రులతో పంచుకునే విధంగా స్నేహపూర్వక వాతావరణం ఉండాలన్నారు. పిల్లలను భిక్షాటన చేయించడం, మాదక ద్రవ్యాల సరఫరాలో ఉపయోగించడం, బాల కార్మికులుగా మార్చడం, బాల్య వివాహాలు జరిపించడం, వ్యభిచారానికి దారితీసే అనైతిక కార్యకలాపాల్లో కలిపే చర్యలపై తీవ్రంగా పర్యవేక్షణ ఉండాలని సూచించారు. అలాంటి సంఘటనలు ఎవరికైనా కనిపిస్తే వెంటనే 1098, 100 లేదా 1930 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు.

# శాయంపేట కేటీఆర్ సేన అధ్యక్షుడిగా రాకేష్



అక్షర దర్బార్, పరకాల : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేటీఆర్ సేన నాయకులు గురువారం భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. భూపాలపల్లి జిల్లా కేటీఆర్ సేన శాయంపేట మండల అధ్యక్షుడిగా నియమితులైన రాకేష్ ను అభినందించి సత్కరించారు. బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, అధికార కాంగ్రెస్ పార్టీ అబద్దాల ప్రచారాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా వేదికగా ఎండగట్టాలని తెలిపారు. వారి వెంట భూపాలపల్లి జిల్లా కేటీఆర్ సేన జిల్లా అధ్యక్షులు వీసం భరత్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షులు పిన్నింటి మణిదీప్, యూత్ నాయకులు సికిందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# చిట్యాల ఆసుపత్రిలో వైద్యులను నియమించాలి

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి
- ఆసుపత్రిలో డాక్టర్ల కొరతపై ఆగ్రహం



అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల సివిల్ ఆసుపత్రిలో డాక్టర్లను తక్షణమే నియమించకపోతే నిరసనకు సిద్ధమవుతామని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి హెచ్చరించారు. గురువారం ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించిన ఆయన, సరైన వైద్యం లేక ప్రజలు వరంగల్, భూపాలపల్లి ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. 18 మంది డాక్టర్లు అవసరమైన చోట కేవలం 6 మంది మాత్రమే ఉండటం, అందులో నలుగురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే ఉండడం ఆందోళనకరమన్నారు. ఓపి సంఖ్య తగ్గిపోవడం ప్రజల్లో ఆసుపత్రిపై నమ్మకం తగ్గినదానికి నిదర్శనమని చెప్పారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు ఫోన్ చేసి డాక్టర్ల నియామకం, ఎక్స్‌రే యంత్రం పని చేయకపోవడం వంటి అంశాలు తెలియజేశారన్నారు. ఒక నెలలోగా పరిస్థితి మెరుగుపడకపోతే నిరహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. రైతులకు యూరియా కేటాయించకపోతే వారు కూడా ఆందోళనకు దిగాల్సి వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ.

**చిట్యాల మండలంలో జూకల్ గ్రామంలో భాషబోయిన మల్లమ్మ, ముచినిపర్తి గ్రామంలో తూముల నర్సమ్మ, జడలపేట గ్రామంలో మూల ఆదిరెడ్డి మరణించగా వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించారు. బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రాజగోపాలరావు ఇటీవల ప్రమాదంలో గాయపడగా కలిసి పరామర్శించారు.**

# ఐదుగురు అనుమానితుల బైండోవర్




అక్షర దర్బార్, దుగ్గొండి: మండల పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురు వ్యక్తులను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకొని, తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్టు దుగ్గొండి ఎస్ఐ రావుల రణధీర్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ రణధీర్ రెడ్డి మాట్లాడుతూ, మండలంలోని వివిధ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతూ, నేరానికి అనుకూలమైన ప్రదేశాల్లో కనిపించిన నేపథ్యంలో వీరిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా వీరిని దుగ్గొండి తహసీల్దార్ రాజేశ్వరరావు ముందు హాజరుపరిచి బైండోవర్ చేసినట్లు వెల్లడించారు. అనుమానితులను గమనిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ రణధీర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడి

అక్షర దర్బార్ మల్హర్: కాటారం డిఎస్పి సూర్యనారాయణ, సీఐ నాగార్జున రావు ఆదేశాల మేరకు కొయ్యూరు ఎస్సై వడ్లకొండ నరేష్ తన సిబ్బందితో తాడిచెర్ల గ్రామంలో పెట్రోలింగ్ చేశారు. అనుమానిత గుడుంబాను గుర్తించారు. దీనిని విక్రయించే జోడు రవి వద్ద నుండి 24 లీటర్ల గుడుంబా పట్టుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిషేధిత గుడుంబా, గంజాయి విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



# ప్రభాకర్ రావుకు షాక్

- ఫోన్ ట్యాపింగ్ కేసులో ట్విస్ట్
- సుప్రీం కోర్టును ఆశ్రయించనున్న 'సిట్'



అక్షరదర్బార్, హైదరాబాద్: రాష్ట్రంలో కొద్దినెలలుగా చర్చనీయాంశంగా ఉన్న ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకున్నది. మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు విచారణకు సహకరించకపోవడంతో సిట్ అధికారులు సుప్రీంకోర్టులో పిటిషన్ వేయనున్నట్టు సమాచారం. ఈ మేరకు డీసీపీ విజయ్‌కుమార్, ఏసీపీ వెంకటగిరి ఢిల్లీకి వెళ్లి కోర్టు పనులు చూస్తున్నట్లు తెలిసింది. ప్రభాకర్‌రావును అరెస్ట్ చేయవద్దని గతంలో సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలోనే సిట్ ఈ నిర్ణయం తీసుకున్నది. సిట్ ఇకపై ప్రభాకర్ రావును కస్టడీకి తీసుకోవాలని భావిస్తున్నది. ఇదిలా ఉండగా.. ఇప్పటికే ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు ల్యాప్‌టాప్, ఫోన్‌ను సిట్ సీజ్ చేసింది. ఈ నేపథ్యంలో వాటిలోని డేటా కీలకంగా మారనున్నది. వీటి నుంచి డేటాను సేకరించే పనిలో అధికారులు ఉన్నారు. ల్యాప్‌టాప్, ఫోన్ ఇప్పటికే ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌కి చేరాయి. నిపుణులు 2023 అక్టోబర్ నుంచి మార్చి15 వరకు కాల్ డేటాను బయటకు తీసే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, ప్రభాకర్ రావు.. పలువురు బీఆర్ఎస్ నేతలతో, పోలీసు ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపినట్టు సిట్ అనుమానం వ్యక్తం చేస్తోంది. ఇక, ఇప్పటికే నిందితులు, బాధితుల వాంగ్మూలం ఆధారంగా సిట్ ప్రభాకర్‌రావును విచారిస్తున్నది.

# పాముకాటు తో మహిళా మృతి

అక్షర దర్బార్, రేగొండ: పాము కాటుతో మహిళ మృతి చెందిన ఘటన రేగొండ మండలం చిన్న కోడెపాక గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాసిం పల్లి గ్రామానికి చెందిన గాజుల వనమాల (49) భర్త గాజుల సుబ్బయ్య తో కలిసి చిన్న కోడెపాక గ్రామంలోని బంధువుల ఇంటికి ఈనెల 7న వెళ్లి నిద్రిస్తుండగా వనమాల పైనుండి ఏదో పారిందని లేచి చూడగా ఛాతిపై పాము కాటు గుర్తులు కనిపించి పరకాల ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి ఎంజిఎంకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు రేగొండ ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు.మృతురాలి కుమారుడు గాజుల శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

# విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: భూపాలపల్లి మండలం ఎమ్మెస్ కొత్తపల్లి శివారు 33/11 కె.వి లైన్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో అంకిశ్వరపు వెంకటస్వామి అని ఎలక్ట్రీషన్ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది ప్రైవేట్ ఎలక్ట్రీషన్ గా పనిచేసే వెంకటస్వామి విద్యుత్తు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ఎల్సి తీసుకోకుండా ఒక రైతుకు సంబంధించిన విద్యుత్తు మరమ్మతుల పని కోసం విద్యుత్ పోలు ఎక్కి షాక్ తో మృతి చెందినట్లు తెలిసింది,

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State. Editor : VEMULA RAJESHWER RAO, email : akshardarbarnews@gmail.com, office No : 7680992278 ★ RNI NO. TELTEL/2022/81915